క్లుప్తంగా

వరిపిండితో సీతారాముల విగ్రహాలంకరణ



వాకతిప్పలో వరిపిండితో అలంకరించిన సీతారాములు

కొత్తపల్లి: శ్రీరామ నవమి మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని వాకతిప్ప పద్మశాలి రామాలయం వద్ద సీతారాముల విగ్రహాలను వరిపిండితో అలంకరించారు. ఉదయం ఆలయ అర్చకుడు రవితేజ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాతికి స్వామి, అమ్మవార్ల విగ్రహాలను వరి పిండితో అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

భీమేశ్వరునికి ప్రత్యేక పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో శనివారం పంచమిని పురస్కరించుకుని వసంత నవరాత్ర వేడుకల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, మహాన్యాసం, కుమారా రామభీమేశ్వర స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, బాలాత్రిపుర సుందరి దేవికి నవావరణార్చన, నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు.

నేటి నుంచి సముద్రంలో వేట నిషేధం

తొండంగి: సముద్రంలో మత్స్యసంపద పెరిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వేట నిషేధం ఆదివారం నుంచి అమలులోకి వస్తుందని తుని మత్స్యశాఖాధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు శనివారం తెలిపారు. నాటు పడవలు మినహా మెకనైజ్డ్, మోటార్ బోట్లపై మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ల రాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ 13 వరకూ వేట నిషేధం అమలులో ఉంటుందన్నారు. మత్స్యకారులు వేట నిషేధం అమలుకు సహకరించాలని కోరారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

ఏలేశ్వరం: పట్టణంలో జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు రెండోరోజు శనివారం హోరాహోరీగా సాగాయి. స్థానిక కంబాలపాలెం కాలనీలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ వాలీబాల్ టోర్నీలో 24 జట్లు పాల్గొన్నాయి. పోటీలు రసవత్తరంగా సాగడంతో స్థానికులు ఆసక్తిగా వీక్షిస్తున్నారు. అంబేడ్కర్ జయంతిరోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు కుప్పాల కాశీ, గుమ్మాల రాంబాబు, నీలపల్లి నాగు, పిల్లా రవి, కండెల్లి రాజు, దుండి శ్రీను, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేదాంత మహాసభలు ప్రారంభం



ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్న దివ్యానంద సరస్వతీస్వామి

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురం చిద్గగనానంద గీతాశ్రమంలో శనివారం భక్తిజ్ఞాన వేదాంత మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయనగరం జిల్లా గంగచోళ్లపెంట జ్ఞానానంద గీతాశ్రమం పీఠాధిపతి యోగానందా భారతీస్వామి ఆధ్వర్యంలో మూడురోజుల పాటు వేదాంత మహాసభలు నిర్వహించనున్నారు. మొదటిరోజు ప్రణవోపాసన, ప్రాతఃకాల ప్రార్థన, నగర సంకీర్తన, యోగానందా భారతీ స్వామి వారితో పతాకారోహణ, సూర్యనమస్కారాలు, జ్యోతిప్రజ్వలన నిర్వహించారు. సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు ప్రార్థన చేశారు. అనంతరం గీతాపారాయణ, గీతా యజ్ఞం నిర్వహించారు. కాకినాడ గీతాశ్రమం దివ్యానంద సరస్వతీస్వామితో పాటు పలువురు స్వామీజీలు ప్రవచనాలు, భజనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న మట్టి, గ్రావెల్ మాఫియా

కోటనందూరు: మండలంలో మట్టి, గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా గ్రామాల్లో అనధికారికంగా వందల ట్రాక్టర్ల మట్టి, గ్రావెల్ తరలించి జేబులు నింపుకుంటున్నారు. అధికారులు విధుల్లో ఉండని ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో అధికారుల కళ్లు కప్పి గుట్టుచప్పుడు కాకుండా ఇటుక బట్టీలు, లోతట్టు ప్రాంతాలు ఎత్తు చేయడానికి మట్టిని తరలిస్తున్నారు. అన్నీ తెలిసినా.. రెవెన్యూ అధికారులు మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల తీరుపట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జన జీవనానికి ఇబ్బంది కలిగిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న మట్టి మాఫియా ఆగడాలపై కొరడా ఝుళిపించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల నిర్వహణకు సంసిద్ధం

- 1750 మంది అధికారుల నియామకం
- ఎన్నికల సిబ్బందికి శిక్షణ
- నియోజకవర్గ ఆర్వో రామ్‌సుందర్‌రెడ్డి



పిఠాపురంలో ప్రధాన ఎన్నికల కార్యాలయం

పిఠాపురం: వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పీఓలు 260 మంది, ఏపీఓలు 260 మంది, ఓపీఓలు 260 మందితో కలిపి ఇతర సిబ్బంది 1750 మంది పోలింగ్ అధికారులను సిద్ధం చేసినట్లు జేసీ, పిఠాపురం నియోజకవర్గ ఆర్‌ఓ రామ్‌సుందర్ రెడ్డి తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లపై చేపట్టిన చర్యలను ఆయన శుక్రవారం 'సాక్షి'కి వివరించారు.

242 పోలింగ్‌బూత్‌ల ఏర్పాటు

పిఠాపురం నియోజకవర్గంలో 242 పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. 22 రూట్‌లు, 138 లోకేషన్లు, 22 సెక్టార్లుగా విభజించామని తెలిపారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక పీఓ, ఒక ఏపీఓ, నలుగురు ఓపీఓలు కలిసి ఆరుగురు బాధ్యతలు నిర్వహిస్తారన్నారు. వీరితో పాటు ఇతర సిబ్బంది ఉంటారన్నారు.

18న నోటిఫికేషన్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆ రోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. నామినేషన్లు వేసే అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. ఒక అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే నామినేషన్ల కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో అభ్యర్థుల అనుచరులు ఉండాలని, అది కూడా గుంపులుగా ఉండరాదన్నారు. ఈ నిబంధనలు అనుసరించి ప్రతి అభ్యర్థి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. ముహూర్తాలు చూసుకుని వచ్చే అభ్యర్థులు ముందుగా అధికారులకు సమాచారం ఇస్తే ట్రాఫిక్ తదితర ఏర్పాట్లను చూసుకునే వీలు ఉంటుందన్నారు. అభ్యర్థులు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం తమ నామినేషన్‌తో పాటు ఆస్తులు, అప్పులు, కేసులు, కేసుల్లో శిక్షలు పడిన వివరాలు రూ.10 స్టాంప్ పేపర్‌పై అఫిడవిట్ దాఖలు చేయాలన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థులు ఇటీవల తీసిన స్టాంప్ సైజు ఫొటో, బ్లాక్ అండ్ వైట్‌లో బాగా కనిపించే విధంగా ఉండే విధంగా తీయించి ఇవ్వాలన్నారు.



జేసీ, పిఠాపురం నియోజకవర్గ ఆర్‌ఓ రామ్ సుందర్ రెడ్డి

రూ.10 వేల నామినేషన్ ఫీజు

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రూ.10 వేల నామినేషన్ ఫీజు చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులయితే రూ.5 వేలు చెల్లించాలన్నారు. రికగ్నైజ్డ్ అభ్యర్థులు తనకు ప్రపోజర్‌గా ఒక వ్యక్తిని నియమించుకోవచ్చని, అతను పిఠాపురం నియోజకవర్గంలో ఎక్కడైనా ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు మాత్రం రాష్ట్రంలో ఎక్కడైనా ఓటు హక్కు కలిగి ఉండొచ్చన్నారు. ఈ వివరాలతో ఫారం 26 ఇవ్వవలసి ఉంటుందన్నారు. ప్రతి అభ్యర్థి ప్రస్తుతం కొత్తగా ఓపెన్ చేసిన బ్యాంకు అక్కౌంట్ వివరాలు ఇవ్వాలని, తాము చేసే ఎన్నికల ఖర్చు ప్రతిరోజూ దానిలో చూపించాలన్నారు. ఎన్నికల ఖర్చు బ్యాంకు లావాదేవీల ద్వారా జరిగేలా చూడాలన్నారు. ఈ వివరాలను ఒక ప్రత్యేక అధికారి ఎన్నికల లోపు మూడు సార్లు పరిశీలిస్తారని ఆయన తెలిపారు. ఈ ఖర్చుల వివరాలు చూసుకునేందుకు అభ్యర్థులు ఎవరికి వారు ఒక ఏజంట్‌ను నియమించుకోవచ్చని తెలిపారు.

హెల్ప్ డెస్క్ సేవలు

ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన నాటి నుంచి పిఠాపురం ఎన్నికల ప్రధాన కార్యాలయమైన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ పని చేయనుందన్నారు. అభ్యర్థులు ఈ డెస్క్ సేవలను వినియోగించుకోవచ్చన్నారు. ఫారం 8 సమర్పించి జనరల్ ఏజంటును ఏర్పాటు చేసుకోవచ్చని, అవసరమైతే ఏజంటును మార్చుకునే వీలు కూడా ఉందన్నారు. ఇప్పటికే ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తదుపరి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. అభ్యర్థులు, వారి అనుచరులు శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని కోరారు. ఎన్నికల అధికారులకు పూర్తి సహకారం అందించాలని అభ్యర్థులకు సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



జనసేన, టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో పట్టణ నాయకులు

సామర్లకోట: స్థానిక 8వ వార్డు, 25కు చెందిన జనసేన, టీడీపీ నాయకులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరడానికి వచ్చిన జనసేనకు చెందిన కర్రి వెంకటరమణ, 25వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు నల్లమిల్లి శివ, చల్లా గణేష్‌లకు దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను పార్టీ కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, కౌన్సిలర్లు గుబ్బల సత్యనారాయణ, యార్లగడ్డ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వెంకటనారాయణ తెలిపారు. ఎంపీపీ కారే సుధ ఆధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరిగే సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తారన్నారు. అన్ని శాఖల అధికారులు తన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

సంక్షేమ ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వండి

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- మల్లాంలో ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో అవ్వను ఆప్యాయంగా పలకరిస్తున్న వంగా గీత

పిఠాపురం: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వాలని కాకినాడ ఎంపీ, ఆ పార్టీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత కోరారు. మండలంలోని మల్లాంలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు తదితరులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఇప్పటివరకూ ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. వీధివీధినా స్థానికులు ఆమెకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అందరితో మమేకమైన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని, మీ ఇంటి మనిషిగా పిఠాపురం ప్రజల ఆడపడుచుగా అందరికీ సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ముందుకే పాలన తీసుకువచ్చి సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్లకే చేర్చుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలన్నారు. తాము చేసిన అభివృద్ధి, సంక్షేమమే తమ ఓటు బ్యాంకు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అడుగడుగునా మహిళలు ఆమెకు స్వాగతం పలుకుతుంటే ఆమె వారిని ఆప్యాయంగా పలకరించి అక్కున చేర్చుకుని వారితో మమేకమయ్యారు. ప్రతి ఇంటికీ వెళ్లిన ఆమె ఇప్పటివరకూ తాను పిఠాపురం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మల్లాంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత

రీ పోల్‌కు తావివ్వద్దు

- ఎన్నికల నిర్వహణ బాధ్యత పీఓ, ఏపీఓలదే
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్



పెద్దాపురం పీఓ, ఏపీఓల శిక్షణ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

పెద్దాపురం: ఎన్నికల సమయంలో విధులు నిర్వర్తించే సిబ్బందికి పూర్తి స్థాయి అవగాహన అవసరమని, ఎన్నికల నిర్వహణ బాధ్యత పీఓ, ఏపీఓలపై ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ అన్నారు. పెద్దాపురం లూథరన్ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న పీఓ, ఏపీఓల శిక్షణ తరగతులను శనివారం ఆయన పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ నిబంధనలకు లోబడి సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సిబ్బంది ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని, కమిషన్ నిబంధనలపై మరింత పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూచ తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ సమయంలో పీఓ, ఏపీవోలు సమన్వయంతో పని చేయాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభానికి ముందు నిర్వహించే మాక్‌పోల్ అత్యంత కీలకమని, సిబ్బంది అప్రమత్తత అవసరమన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్ పనితీరు, పీఓ డైరీ, ఇతర డ్యాకుమెంట్లు పూర్తి చేయడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పీఓ, ఏపీఓలు పోలింగ్ ప్రక్రియలో ఎటువంటి తప్పులకు తావు లేకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని కలెక్టర్ నివాస్ సిబ్బందికి సూచించారు. అనంతరం ఈవీఎంల పనితీరు, పోలింగ్ ప్రక్రియ ఏర్పాటు, పోలింగ్ అధికారుల విధులు, ఓటింగ్ కంపార్టుమెంటు, బ్యాలెట్ బాక్సుల నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక మహారాణి కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల భద్రతా గదులు పరిశీలించి ఆర్డీఓ, ఆర్‌ఓ జేఎస్ రామారావుకు పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పెద్దాపురం, సామర్లకోట తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు కేవీ పద్మారావు, రామారావు, డిప్యూటీ తహసీల్దార్ పద్మజ, భానుకుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులపై ప్రత్యేక నిఘా



రైల్వే సిబ్బందితో సమీక్షలో మాట్లాడుతున్న స్టేషన్ మేనేజరు రమేష్ తదితరులు

- సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా తనిఖీలు చేయాలి
- వివిధ శాఖల అధికారుల సమీక్షలో రైల్వే మేనేజరు

సామర్లకోట: రైల్వే ప్రయాణికులపై వివిధ శాఖల అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలని రైల్వే మేనేజరు ఎం.రమేష్ అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో శనివారం రైల్వేలోని వివిధ శాఖలకు చెందిన అధికారులతో ఆయన సమీక్షించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రయాణికుల రూపంలో మద్యం, మత్తు పదార్థాలు, నగదు రవాణా అయ్యే అవకాశాలు ఉంటాయని దీనిని దృష్టిలో ఉంచుకుని అనుమానంగా ఉన్న వ్యక్తుల బ్యాగ్‌లను తనిఖీలు చేయాలన్నారు. ఈ మేరకు ప్రయాణికులు సహకరించాలన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్తున్న సమయంలో ఆ నగదుకు తగిన ఆధారాలు ఉండాలన్నారు. అలాగే అనుమతి లేని వస్తువులను రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులతో పాటు రైల్వేలో పని చేసే వివిధ శాఖలకు చెందిన అధికారులకు ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేసే అధికారం ఇస్తున్నట్లు తెలిపారు. భారీ మొత్తంలో నగదు గుర్తిస్తే స్థానిక రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన తెలిపారు. చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ (వర్క్స్) బసవేశ్వరరావు, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు ఏవీకె సంతోష్‌కుమార్, సీనియర్ సెక్షన్ ఇంజనీరు(టెలికాం) ఎజెవీవీఎస్ నారాయణరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



వివిధ పార్టీల ప్రజా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ లతాకుమారి

- డీఎస్పీ లతాకుమారి

పెద్దాపురం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది సహకరించాలని డీఎస్పీ లతాకుమారి కోరారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయా రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు ఎన్నికల నియమావళిపై సమీక్షించారు. డీఎస్పీ మాట్లాడుతూ సోషల్‌మీడియాలో వస్తున్న ప్రకటనలు పట్టించుకోకుండా ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రక్రియకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మద్యం, నగదు పంపిణీలపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు చేపట్టే ప్రతి కార్యక్రమానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అల్లర్లు సృష్టించే వారిపై, రౌడీషీటర్లపై ముందస్తు అరెస్టులు ఉంటాయని, ప్రజా ప్రతినిధులు ఎన్నికల సజావుగా సాగించేందుకు సహకరించాలని డీఎస్పీ లతా కుమారి కోరారు. అనంతరం ప్రజా ప్రతినిధులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో సీఐ రవికుమార్, ఎస్ఐ వెలుగుల సురేష్, గవరసాని సూరిబాబు (వైఎస్సార్ సీపీ) తాటికొండ అచ్చిరాజు (వైఎస్సార్ సీపీ), రంధి సత్యనారాయణ (టీడీపీ), అడబాల కుమారస్వామి (టీడీపీ), నీలపాల సూరిబాబు (సీపీఎం)లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

స్థానికునిగా ఒక అవకాశం ఇవ్వండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి
- 26వ వార్డులో ఇంటింట ప్రచారం



సామర్లకోట 26వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న దొరబాబు

సామర్లకోట: నియోజకవర్గంలో ప్రజలు స్థానిక అభ్యర్థిని కొరుకొంటున్నారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక 26వ వార్డు అయోధ్యరామపురంలో ఆ వార్డు సీనియర్ నాయకులు సక్కా జానకి రామారావు, శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో దొరబాబు తన విజయసంకల్ప యాత్రతో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వార్డులో పలువురు పార్టీలో చేరారు. దాంతో ఎన్నికల ప్రచారం హోరెత్తింది. సుమారు 40 ఏళ్ల తరువాత స్థానిక అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసే అవకాశం సీఎం జగన్ తనకు అవకాశం ఇచ్చారని, ఈ మేరకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనను ఆశీర్వదించాలని విజయసంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేస్తామని చెప్పారు. స్థానికేతరులకు ఇక్కడి సమస్యలపై అవగాహన లేకపోవడం వల్ల నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని ఆరోపించారు. సీఎం జగన్ అమలు చేసిన నవరత్న, సంక్షేమ పథకాలే తమ విజయానికి పునాది అని చెప్పారు. ఉమ్మడి రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ చైర్మన్ గొరకపూడి చిన్నయ్యదొర, మాదిగ ఐక్యవేదిక జిల్లా నాయకుడు కాళ్ల లక్ష్మీనారాయణ, రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, పట్టణ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్ కుమార్, కరణం రాజ్‌కుమార్, సొసైటీ అధ్యక్షులు మేకా శ్రీను, వీరంరెడ్డి నాని కౌన్సిలర్లు సేపెని సురేష్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డిని కలిసిన దవులూరి



వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ మిథున్ రెడ్డితో దొరబాబు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు శనివారం కలుసుకున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా కాకినాడ వచ్చిన ఆయన నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఉమ్మడి రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ అధ్యక్షుడు, భారత మాత సేవా పరిషత్ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర, వైఎస్సార్ సీపీ నాయకుడు కరణం భాను తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మీలో ఒకరైన దొరబాబును గెలిపించండి



పవర గ్రామంలో ప్రచారం చేస్తున్న దొరబాబు భార్య దవులూరి చంద్రకళ, కుమార్తె సార్విక

పెద్దాపురం: మీతో నిత్యం ఉండే తన భర్తను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రానున్న ఎన్నికల్లో గెలిపించాలని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలో 7, 17వ వార్డుల్లో ఆమె అయ్యారక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల లక్ష్మీ రాజేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్ సయ్యద్ అమీనా బీబీ, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, పార్టీ మహిళా కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరో దఫా వైఎస్సార్ సీపీకి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. స్థానికంగా ప్రజా సమస్యలపై పూర్తి అగాహన ఉందని నియోజకవర్గ ప్రజలు ఆదరించి స్థానికుడైన దొరబాబును, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను ఓటు వేసి గెలిపించాలని కోరారు. కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కర్, వెంకటలక్ష్మి, విడదాసరి రాజా, టౌన్ అధ్యక్షులు కాపగంటి కామేశ్వరరావు, అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పవర గ్రామంలో..

సామర్లకోట: మండల పరిధిలోని పవర గ్రామంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ, కుమార్తె సార్విక ఎన్నికల ప్రచారం చేశారు. ఎంపీ అభ్యర్థి సునీల్‌కు, ఎమ్మెల్యేగా దొరబాబుకు ఫ్యాన్ గుర్తుపై వేసి వారిని గెలిపించాలని కోరారు. సర్పంచ్ నాగనబోయిన సీతామహాలక్ష్మి, రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనియా, ఎంపీటీసీ నాగనబోయిన చంటిబాబు, గ్రామ నాయకులు నాగనబోయిన రాజబాబు, వీరంరెడ్డి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరికి చేరిన సత్యదేవుని ధ్వజస్తంభం కర్ర

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ కోసం సేకరించిన 65 అడుగుల పొడవైన నారప జాతి కర్రను శనివారం సాయంత్రం రత్నగిరికి చేర్చారు. గత ఆగస్టులో ఈ కర్రను స్థానిక పంపా సత్రానికి తీసుకువచ్చి అక్కడ భద్రపరచిన విషయం విదితమే. అక్కడ నుంచి శనివారం సాయంత్రం పొక్లెయిన్, ట్రాక్టర్ సాయంతో ఘాట్‌రోడ్ ద్వారా తూర్పు రాజగోపురం సమీపానికి తీసుకువచ్చారు. రాజగోపురం మెట్ల మీదుగా ఆలయంలోని అనివేటి మండపం వద్దకు ధ్వజస్తంభాన్ని తీసుకుని వెళ్లి అక్కడ ఉంచారు. ఈ ధ్వజస్తంభం కర్రను దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ పరిశీలించారు. దేవస్థానం ఈఈ నరసింహారెడ్డి, ఏఈఓ కృష్ణారావు, డీఈలు గుర్రాజు, రాంబాబు, ఉదయ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

22న ధ్వజస్తంభం ప్రతిష్ఠ

సత్యదేవుని నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఈ నెల 18న ప్రారంభిస్తారు. 22న ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తారు. నెల్లూరుకు చెందిన భక్తుడి కుటుంబ సభ్యులు 130 మంది కలిసి ఈ ధ్వజ స్తంభం ప్రతిష్ఠి నిర్వహిస్తున్నారు. ప్రతిష్ఠ అనంతరం దానికి స్వర్ణ రేకు తాపడం చేయనున్నారు.